# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**AUGUST-2014**

సంవత్సర చందా రూ. 50/-

# బైబిల్ లెక్చర్‌షిప్

## BIBLE LECTURESHIP

స్థలము : సత్యవాణి – క్రీస్తు సంఘము
7-9-35, సాంబమూర్తి వీధి,
కుళాయిచెర్వు ఎదురుగా,
రామారావు పేట, కాకినాడ – 533 004

సమయం : 2014 నవంబరు,11 నుండి 14 వరకు
ప్రతిరోజు ఉదయం 10 గంటలకు
ప్రారంభమగును

ప్రసంగీకులు : అనుభవజ్ఞులైన స్వదేశ విదేశ సహోదరులు
ఉపన్యసించెదరు.

భోజనం వసతి ఉచితం, మొదట్లో 20/-రూ॥లు రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రము కట్టవలెను. ఆ కూటములకు హాజరగుటకు సిద్ధపడండి. ప్రార్థించండి, తప్పక రండి.

వందనములతో
జాషువా గూటం
రిక్కీ గూటం
రోని గూటం

ఫోన్ నెంబరు : 0884 – 2363722, 9912286255

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 34 | ఆగస్టు- 2014 | సంచిక - 1


## నిత్యజీవిత తృష్ణ
### (Man's Longing for Immortality)

భూమి మీద మానవుల వయోపరిమాణము స్వల్పకాలవే అయినను వారందరిలో సహజముగా ఒక కోరిక యున్నది. అది నిత్యము జీవించవలెననెడి కోరిక. చావు అనిన సహజముగ భయ పడువాడు మానవుడు. గోత్రకర్తయగు యోబు అలనాడెప్పుడో "మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా?" యని ప్రశ్నించి తనలోయున్న నిత్యజీవిత తృష్ణను వెలిబుచ్చెను (యోబు 14:14). యోబు వేసిన ప్రశ్న మానవజాతి ఆరంభమైన నాటినుండి నేటి వరకు వేయబడుచున్న ప్రశ్నయైయున్నది. హేబెలు చనిపోగా ఆదాము హవ్వలు, చివరకు కయీను కూడ అతడు మరల బ్రతుకునా? యని ఆలోచించి యుండకపోరు. లక్షలకొలది మానవులు నేడు చనిపోవుచున్నారు గనుక ఇది మనము తరుచు ఎదుర్కొనుచున్న ప్రశ్నయై యున్నది. మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా, యని యోబు అడిగిన ప్రశ్న ఈనాడు మన ప్రశ్నయై యున్నది. గనుక మనందరము అమర్త్యతను (Immortality) వెదుకుచున్నామని ఒప్పుకొనక తప్పదు.

అయితే అమర్త్యత (Immortality) అనగా యేమిటి? ఒకడు మరణించిన తరువాత అతని ఆత్మ జీవించియుండుట లేక ఉనికిని కలిగియుండుట అమర్త్యత అని సాధారణముగ అందరు తలంచెదరు. అంటే – ఒకడు మరణమొందగానే అతడు అంతమొంది యుండలేదు అని అందరు అంగీకరించుచున్నారు. ఇందు విషయమై బైబిలు చెప్పునదేమంటే - ఒకడు మరణించగా అతని ఆత్మ జీవించుచునే యుండును. సరిగదా ఒకానొక దినమందు అది నిత్యత్వము (Eternity) లో ప్రవేశించునపుడు శరీరముతో పునరుత్థానమగును. ఆత్మ శరీరముతో ఏకమై మరి ఎన్నటికి ఎడబాయకుండు నిమిత్తము లేపబడును. క్రైస్తవునికి ఇది బహు ధన్యకరమైన స్థితి యగును.

నిత్యజీవితము యథార్థమైనదని మానవులు నమ్ముటకు అనేక ఋజువులున్నవి. పురాతన నాగరికతలను మనము పరిశోధించిన యెడల వేలకొలది సంవత్సరముల క్రితమున్న ప్రజలకు నిత్యజీవితమునందు నమ్మకమున్నదని ఋజువగుచున్నది. ఉదాహరణ ఐగుప్తు దేశీయులు ఆకాశమునంటుకొనియున్నట్లు నిర్మించుకొనిన పిరమిడ్లు (గోపురములు) దీనికొక సాదృశ్యముగ యున్నవి. భారతీయులలో పునర్జన్మను గూర్చిన యభిప్రాయములు ప్రబలి యున్నవి. దీనిని బట్టి మానవుడు శాశ్వతముగా నిర్మూలించబడుటకు కాదు గాని ఏదో ఒక రీతిగ తను శాశ్వత ఉనికిని కలిగియుండుటకు ఆశించుచున్న వానిగా కనబడుచున్నాడు.

మానవజాతి యంతటిలోను మార్పుజెందని కొన్ని నిత్య సత్యములున్నవి. అవి ఒకే ఒక్క దేవునియందు నమ్మిక కలిగియుండుట. మంచి చెడు అను విచక్షణ జ్ఞానము, భావి జీవితమందు ప్రగాఢమైన విశ్వాసము, క్రియ ప్రక్రియలను గూర్చిన జ్ఞానము మొదలగునవి. ఇవి సార్వజనికమైనవి. మానవులకు వీటిని గూర్చి యెవరును బోధించకనే వారు వీటిని యెరిగి యున్నారు. ఈ సంగతులను గూర్చిన వారి జ్ఞానము ఎక్కడ నుండి వచ్చినదో మనము వివరించుకొనలేకపోయినను వారి విశ్వాసము ఆధారము లేనిది కాదు.

ఈ భూమిపై యున్న జీవరాసులన్నియు ఏదో ఒక ప్రయోజనమును కలిగియున్నవి. కొన్ని మానవునికి ఆహారము కొరకు ప్రయోజన కారియై యున్నవి. కొన్ని క్రిమి సంహారకులు గాను, మరికొన్ని మన వాతావరణమును పరిశుభ్రముగా నుంచునవి గాను, యున్నవి. అయితే ఈ పుడమిపై మానవుని ప్రయోజనమేమిటి? అతడు తన సృష్టికర్తయైన దేవుని కొనియాడుచు,

మహిమపరచుచు ఆయనతో నిత్యము జీవించుటకు చేయబడని యెడల మరెందుకు అతడు చేయబడెను ?

మానవుని భౌతిక సంబంధమైన కోరికలను తీర్చుకొను ఆధారము భూమిపై యున్నది. శబ్ధ తరంగములను పరిగ్రహించుటకు చెవులు అవసరము, వర్ణములను గుర్తించుటకు నేత్రముల వసరము. వాతావరణములోని గాలిని పీల్చుటకు ఊపిరితిత్తులు అవసరము. ఆహారమునకు ఆకలియు, దాహమునకు దప్పికయు అవుసరము. ఈ భౌతికావస రములన్నిటిని తీర్చుకొనుటకు మానవుని శరీరమును దేవుడు తయారుచేసెను. అట్లయినపుడు నిత్యము జీవించవలెనని మానవునికున్న ఆత్మీయ తృష్ణను దేవుడు తీర్చడా ?

ప్రకృతిని మనము గమనించుట ద్వారా అమర్త్యత మరింత నిశ్చయము అని మనకు ఋజువు అగుచున్నది. గొంగలిపురుగు సీతాకోకచిలుకగా మారి స్వేచ్ఛగా తిరుగులాడుటలో మానవుకున్న నిత్యజీవిత తృష్ణ తీర్చబడగలదని విశ్వసించవచ్చును. ఈ శరీర బంధకము ల నుండి మానవుని ఆత్మ నిత్యత్వములో ప్రవేశించుట ఆ పురుగులో మనకు కన్పడుచున్నది. ప్రకృతిలోని ఋతువులే మరణమును, సమాధిని, అనగా కొంత కనిపెట్టు కాలమును, అటు తరువాత అతి మనోహరమైన క్రొత్త జీవితము జీవించుటకు ఒక పునరుత్థానమును సూచించుచున్నవి. ఆయా సంగతుల ద్వారా మానవుడు ఈ లోక జీవితము కంటె ఘనమైన జీవితము కొరకు ఎదురు చూడవచ్చునని దేవుడు చెప్పకపోతే వాటియొక్క ప్రయోజనమేమి? అందుకే "దేవుని అదృశ్య లక్షణములు. అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేట పడుచున్నవి" యని అపొ. పౌలు రోమా 1:20లో వ్రాసెను.

మానవుని నైతిక పరిజ్ఞానమే విలువలు గల దేవుడొకడు ఉన్నాడని మనకు తెలియజేయుచున్నది. ఈలోక మంతయు ఒకనైతిక చక్రములో యుండి పరిభ్రమించుచున్నట్లు మనము చూడగలము. ఈ నైతిక చక్రములో మానవుడు తన క్రియలను బట్టి ప్రతి ఫలము నొందుటకో లేక శిక్షననుభ వించుటకో ఎదురు చూచుచున్నాడు. అయితే ఒక్కోసారి నీతిమంతులు శ్రమలనొందుట, దుర్మార్గులు సుఖముగ జీవించుట, సజ్జనులు పరాజయులగుట, దుర్జనులు విజేయులగుట మనము చూచుచుందుము. అట్టి సమయాల్లో మానవులు ఈ జీవితములో కాకపోయిన భావి జీవితంలో న్యాయమును దేవుడు

తప్పక తీర్చునని యెదురు చూచుట సహజము. ఆ భావిజీవితంలో తగిన రీతిగ శిక్షింపబడుట జరుగునని మనందరము యెదురు చూచుచునే యున్నాము. నిత్యజీవితం అంటూ లేని యెడల మానవునికున్న ఈ నైతిక విలువల ప్రయోజనము శూన్యమేగదా.

నిత్యజీవితమనునది నమ్మతగిన వాస్తవమని బైబిలు బోధించుచున్నది. పాతనిబంధనలో ఇద్దరు భక్తులు హనోకు, ఏలియా అనువారు మరణమును రుచి చూడకనే పరమునకు కొనిపోబడుటను గూర్చి చెప్పబడియున్నది. మరియు దేవుడు నిర్ణయించిన ఒకానొక దినమందు “సమాధులలో నిద్రించు అనేకులు మేలు కొనెదరు; కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నింద పాలగుటకును నిత్యముగా హేయులగుటకును మేలుకొందురు” అని దానియేలు 12:2లో వ్రాయబడి యున్నది.

యేసుక్రీస్తునందు నిత్యజీవితము దృఢమైన వాస్తవమని మనకు మరింత తేటగా బోధింపబడినది. మరణించిన వారిలో ప్రథమఫలముగా ఇకనెన్నడు మరణించకుండు నిమిత్తము క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నారు. యేసుక్రీస్తు మానవజాతికి నిత్య జీవితమును ప్రసాదించుట కొరకు చనిపోయెను. యేసుక్రీస్తు మరల రాబోవుచున్నారని, మృతుల పునరుత్థానము జరుగునని, తీర్పు తప్పక జరుగునని, ఈ జీవితాంతమున ప్రతివాడు తాను చేసిన క్రియలను బట్టి ప్రతిఫలమో లేక శిక్షయో పొందునని చేయబడిన వాగ్దానములన్నియును మనము నిత్యము జీవించెదమని నిర్ధారణ చేయుచున్నవి. (యోహాను 5:28-29; మత్తయి 10:28; 1 కొరింధి 15:53-54, 2 కొరింథీ 5:1-4).

“కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కాని వాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలచి యుండును” అని యేసు బోధించెను (యోహాను 3:36). యేసుక్రీస్తునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు బొంది, నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అటుతరువాత నీవు మరణము వరకు నమ్మకముగా యున్న యెడల ఆయన నీకు నిత్యజీవిత కిరీటాన్ని బహూకరించును (యోహాను 14:1, అపొ.కా. 2:38, ప్రకటన 2:10).

# గొప్పవిందు
## (The great Supper)
లూకా 14:15-24

**పరిచయము :**

ఈ ఉపమానము లూకా సువార్తలో ప్రత్యేకమైనది. మత్తయి 22:1-14లో చెప్పబడినది దీనివలె యుండినను, అది భిన్నమైనది. రాజు పెండ్లి విందు ఉపమానమును మన ప్రభువు తన పరిచర్య ఆరంభదినాల్లో చెప్పారు. గొప్ప విందును గూర్చిన ఈ ఉపమానము ఆయన పరిచర్య అంతిమదినాల్లో తన శ్రమలవారములో చెప్పబడినది, చివరికి ఒకని యింట్లో యున్న అతిథులకు చెప్పబడినది. మొదటిదానిలో రాజు యొక్క పరిచారకులు హింసింపబడుటను చూడగలము. రెండవదానిలో వారు సాకులు వినవలసి వచ్చినది. మొదటి దానిలో ఆహ్వానింపబడినవారు నాశనము గావించబడిరి, రెండవ దానిలో ఆహ్వానింపబడినవారు మినహాయించబడిరి.

యేసు విశ్రాంతి దినమున పరిసయ్యుల అధికారులలో ఒకని యింట భోజనము చేయుటకు వెళ్లెను. ఆ యింటికి యితరులు కూడ ఆహ్వానింపబడిరి. ఆ సందర్భముగా అక్కడ జరిగిన సంఘటనలను పురస్కరించుకొని యేసు ఈ గొప్ప విందును గూర్చిన ఉపమానము చెప్పారు. 2-6 వచనములను బట్టి యేసును ఇరుకులో పెట్టుటకు ఆవిందు ఏర్పాటు చేయబడినట్లు గ్రహించుకొనగలము. అక్కడ జలోదరరోగము గలవాడొకడుండెను. అతని చూచి యేసు సందిగ్ధములో పడి యేమి చేయునోయని గృహ యజమాని, మిగతా అతిథులు ఆసక్తితో చూచుచుండిరి. అది సబ్బాతు దినము. అయితే యేసు నేరుగా వారినొక ప్రశ్న వేసెను: "విశ్రాంతి దినమున స్వస్థపరచుట న్యాయమా? కాదా? అని ధర్మశాస్త్రోపదేశకులను పరిసయ్యులను అడుగగావారూరకుండిరి. అప్పుడాయన వాని చేరదీసి స్వస్థపరచి పంపివేసి -మీలో ఎవని గాడిదయైనను, ఎద్దయినను గుంటలో పడిన యెడల విశ్రాంతి దినమున దానిని పైకితీయడా? అని వారినడిగెను. ఈ మాటలకు వారు ఉత్తరము చెప్పలేక పోయిరి" (లూకా 14:2-6).

7వ వచనములో పిలువబడిన వారు భోజన పంక్తిలో అగ్రపీఠములు ఏర్పరచుకొనుట ఆయన చూచెను. అప్పుడాయన అగ్రపీఠములను గూర్చిన ఉపమానము చెప్పెను (లూకా14: 8-11). యేసు వినయమును గూర్చి

వారికి బోధించెను. తదుపరి ఆయన తన్ను పిలిచిన గృహయజమానిని సంబోధించెను. తనను తిరిగి తమ విందులకు పిలిచేవారినే అతడు ఆహ్వానించెనని ఆయన అతని విమర్శించెను (లూకా 14:12-14). దేవుడు మన కనుగ్రహించిన సంపదను బట్టి బీదలకు, అంగహీనులకు మనము సహాయపడవలెనని యేసు అతనికి బోధించెను. అతిథ్యము చేయుటవలన కొందరు ఎరుగకయే దేవదూతలకు అతిథ్యము చేసిరి (హెబ్రీ 13:2).

"మరియు ఆయన తన్ను పిలిచిన వానితో ఇట్లనెను - నీవు పగటివిందైనను, రాత్రి విందైనను చేయునప్పుడు నీ స్నేహితులనైనను నీ సహోదరులనైనను నీ బంధువులనైనను ధనవంతులగు నీ పొరుగు వారినైనను పిలువవద్దు; వారు ఒకవేళ మరల నిన్ను పిలుతురు గనుక నీకు ప్రత్యుపకారము కలుగును. అయితే నీవు విందు చేయునప్పుడు బీదలను అంగహీనులను కుంటివాండ్రను గ్రుడ్డివాండ్రను పిలువుము. నీకు ప్రత్యుపకారము చేయుటకు వారికేమియు లేదు గనుక నీవు ధనవంతుడవగుదువు. నీతిమంతుల పునరుత్థానమందు నీవు ప్రత్యుపకారము పొందుదువని చెప్పెను" (లూకా 14:12-14).

ఈ మాట వినగానే గృహయజమాని, అతని అతిథులు కూడ నిరుత్సాహ పడియుందురు. ఆయన వారి మానసిక పరిస్థితిని దుయ్యబట్టెను. అయితే ఆయనతో భోజన పంక్తిలో కూర్చుండిన వారిలో ఒకడు ఈమాటలు విని దేవుని రాజ్యములో భోజనము చేయువాడు ధన్యుడని చెప్పెను (లూకా 14:15).

దేవుని రాజ్యమును గూర్చి యూదులలో అనేక అపోహలుండెను. దేవుని రాజ్యములో అన్యులు కూడ చేర్చబడుదురనే పాత నిబంధన ప్రవచనములను యూదులు గమనించ లేక పోయిరి. (ఆదికా 12:3; యెష 2:2; 62:2; యోవేలు 2:28-3:2). అబ్రాహాముతో వారికున్న శారీరక సంబంధమును బట్టి యూదులు దేవుని రాజ్యమునకు ఆటోమేటిక్‌గా వారసులవుదురని వారు తలంచారు.

**ఉపమానము :**

"ఆయన వారితో ఇట్లనెను - ఒక మనుష్యుడు గొప్ప విందు చేయించి అనేకులను పిలిచెను. విందు కాలమందు అతడు ఇప్పుడు సిద్ధమైయున్నది, రండని పిలువబడినవారితో చెప్పుటకు తన దాసుని పంపెను. అయితే వారందరు ఏక మనస్సుతో నెపములు చెప్పసాగిరి. మొదటివాడు నేనొక పొలము కొనియున్నాను. అవశ్యముగా వెళ్లి దాని

చూడవలెను, నన్ను క్షమింపవలెనని నిన్ను వేడుకొనుచున్నాననెను. మరియొకడు నేనొక స్త్రీని వివాహము చేసికొన్నాను, అందుచేత రాలేననెను. అప్పుడా దాసుడు తిరిగి వచ్చి యీ మాటలు తన యజమానునికి తెలియజేయగా, ఆ యింటి యజమానుడు కోపపడి -నీవు త్వరగా పట్టణపు వీధులలోనికి సందులలోనికి వెళ్లి బీదలను అంగహీనులను కుంటి వారిని గ్రుడ్డివారిని ఇక్కడికి తోడుకొని రమ్ము అని ఆ దాసునితో చెప్పెను. అంతట ఆ దాసుడు -ప్రభువా నీవాజ్ఞాపించినట్లు చేసితిని గాని ఇంకను చోటున్నదని చెప్పెను, అందుకు యజమానుడు నాయిల్లు నిండునట్లు నీవు రాజమార్గములలోనికిని కంచెలలోనికిని వెళ్లి లోపలికి వచ్చుటకు అక్కడి వారిని బలవంతము చేయుము. ఏలయనగా పిలువబడిన ఆ మనుష్యులలో ఒకడును నావిందు రుచిచూడడని మీతో చెప్పుచున్నాననెను" (లూకా 14:16- 24).

ఈ ఉపమానములో గొప్ప విందు చేయించిన మనుష్యుడు దేవునికి సూచనగా యున్నాడు. మానవమాత్రులను ఆయన నిత్యపరలోకానందము కొరకు ఆహ్వానించుచున్నారు. ఆవిందు కొరకు ఆయన అన్నిసంగతులు సిద్ధపరచారు. యేసు రాకముందే ఈ ఏర్పాట్లన్నీ సిద్ధపరచబడెను. గొప్పవిందు సువార్తలోని ఆశీర్వాదములతో సమానము. అది నిత్య రక్షణ. ఆహ్వానము సువార్త ద్వారా ఇయ్యబడుచున్నది. విందు సిద్ధపాటును గూర్చి చెప్పుటకు పంపబడిన దాసుడు యేసుక్రీస్తు. ఆహ్వానింపబడిన వారు యూదులు. వారు దేవునియొక్క ప్రత్యేక ప్రేమను పొందినవారు, విందు, సిద్ధపాటు, క్రీస్తురాకడకు సంపూర్ణమైన కాలము (గలతీ 4:4).

18-20 వచనములలో ఊహించరానిది జరిగినది. ఆహ్వానించబడినవారు రాకుండా సాకులు చెప్పసాగిరి. అరబ్బు దేశాలలో ఆహ్వానమునందుకొన్న తరువాత విందుకు గెర్హాజరవుట గొప్ప సిగ్గుచేటు. దానివలన కొన్ని సందర్భాలలో యుద్ధము కూడ సంభవింపవచ్చును. అందరుసాకులు చెప్పిరి. వారొకరితో నొకరు కూడబలుకుకొని యుండకపోవచ్చును. గాని అందరు సాకులు చెప్పసాగిరి.

ముందుగా చూడకుండనే పొలమును ఎవడైనా కొంటే అతడు బుద్ధిహీనుడే. అలాగే పది ఎడ్లను కొనిన వాడు కూడ వాటిని ముందుగా పరీక్షింపకపోతే బుద్ధిహీనుడే. కొత్తగా పెండ్లి చేసికొనినవాడు తన భార్యను యింటికి తీసికొనివచ్చే యుండును. వీరు ఆహ్వానమును తిరస్కరించలేదు, వారు దుష్కార్యములలో యేమీ మునిగియుండ

లేదు. నేడు దేవుని ఆహ్వానమును తిరస్కరించు అనేకులు చెడుగా ప్రవర్తించు వారుకారు. గాని వారు తమదైనందిన వ్యవహారాలలో తీరికలేక యున్నవారు. ఆత్మీయ విషయాలను గూర్చి తీవ్రముగా ఆలోచించువారు కారు. అందరు సాకులు చెప్పేవారే.

ఈ ముగ్గురు చెప్పిన సాకులు రెండు రకాలైనవి. మొదటి రెండు ఆస్థిని గూర్చినవి. మూడవది సంబంధ బాంధవ్యాన్ని గూర్చి నది. అయితే ఈసాకులు దేవుని వాక్యము హృదయములో పెరుగకుండా అణచి వేయునట్టివి. సువార్త విందుకు నేడు జనములు ఆహ్వానించబడుచున్నారు. గాని యేసు చెప్పినట్లు అనేకులు సాకులు చెప్పుచున్నారు.

21-26 వచనాలలో విందు యజమాని యొక్క కోపము వర్ణించబడినది. ప్రేమమూర్తియైన దేవుడు కోపపడడని కొందరు భావిస్తారు (1 యోహాను 4:8,16, నిర్గమ 4:14; సంఖ్యా 25:4; మార్కు 3:5). అదేరీతిగా ఆహ్వానింపబడిన వారు సాకులు చెప్పగా వారిస్థానమును భర్తీ చేయుటకు దేవుడు సంకల్పించారు. ఆహ్వానమునందు కొని విందుకురాకుండా సాకులు చెప్పిన వారు యేసుకాలము నాటి యూదులు. ఆయనను వారు నిరాకరించారు.

యజమానుడు దాసునితో, "నీవు త్వరగా పట్టణపు వీధులలోనికి, సందుల లోనికి వెళ్లి బీదలను అంగహీనులను కుంటివారిని, గ్రుడ్డివారిని ఇక్కడికి తోడుకొని రమ్మని" చెప్పెను (లూకా 14:21). వారందరురాగా ఇంకను చోటువున్నది. అందుకు యజమానుడు, నాయిల్లునిండునట్లు నీవు రాజమార్గము లలోనికి, కంచెలలోనికి వెళ్లి లోపలికి వచ్చునట్లు అక్కడివారిని బలవంతము చేయుమని" చెప్పెను (లూకా 14: 22-23).

కుంటివారు, గ్రుడ్డివారు సుంకరులు మిగతావారందరు అన్య జనులు. బలవంతముచేయుట! రాజమార్గములలోను, కంచెలలోను యున్న సామాన్యులు ఇంతగొప్ప ఆహ్వానమును పొందుటకు అర్హులము కామని తలుస్తారు గనుక వారిని బలవంతము చేయవలసి వచ్చినది.

విందు యజమాని దేవుడు గనుక అందరు దేవుని రాజ్యము లోనికి ఆహ్వానితులే. మారుమనస్సు పొంది సువార్తకులోబడిన వారెంత ఘోర పాపులైనను వారి పాపములు క్షమించబడును. దేవుడు సర్వమానవళికి దేవుడే. ఆయన యూదులను, యూదులుకాని వారిని అందరినీ రక్షించును. దేవుని కృపగల ఆహ్వానము వర్తించకుండా ఎవరు లేరు. ఎవరికీ అక్కరలేని వారిని ప్రభువే ఆహ్వానించు

చున్నారు.

"సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడనుకాను, ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" అని అపొ.పౌలు తెలియజేసాడు (రోమా 1:16).

గొప్ప విందును గూర్చిన ఉపమానము తమ్మును తాము బహిష్కరించు కొనిన వారితో ముగియుచున్నది. "ఏలయనగా పిలువబడిన ఆ మనుష్యులలో ఒకడును నావిందు రుచి చూడడని మీతో చెప్పుచున్నాను" (లూకా 14:24). నిజానికి ఇదే దృశ్యము కడవరి తీర్పు నాడు కూడ సంభవించును. దేవుని మాటచొప్పున ఆయన పిలుపునంగీకరించని వారు నిత్య నాశనమునకు గురియవుదురు. వారు దేవుని కృపకు దయకు తమ్మునుతామే బహిష్కరించుకొన్నారు.

సాకులు చెప్పినవారు గొప్ప విందులో పాల్గొనలేకపోయారు. సువార్తకు లోబడకుండా నేడు సాకులు చెప్పేవారు కూడ పరలోకము చేరుకోలేరు.

క్రీస్తు కాలమునుండి నేటివరకు యున్న యూదులలో పెక్కుమంది ఆయనను నిరాకరించారు. ఇశ్రాయేలు యొక్క నిరీక్షణను గూర్చి చెప్పబడిన ప్రవచనముల నెరవేర్పునేవారు నిరాకరించారు. అవిశ్వాసము వలన యూదుల యొక్క దౌర్భాగ్యాన్ని, విశ్వాసమువలన అన్యజనుల యొక్క సుభాగ్యాన్ని రోమా 11:12-32 వివరించుచున్నది. ఇప్పుడైతే యూదుడేమి, యూదుడు కానివాడేమి దైవిక ఆహ్వానము నందుకొనుటకు సమాన తరుణములను కలిగియున్నాడు.

**ముగింపు :**

పరిసయ్యుల అధికారి యింటిలో చెప్పబడిన ఈ ఉపమానము గొప్ప విందు ఉపమానమని చెప్పబడినది. దానికి అనేకులు ఆహ్వానింపబడిరి. అందువలన అది గొప్ప విందు. విందు నిచ్చేవాడు గొప్పవాడు. ఆయనే గొప్ప దేవుడు! అది క్రీస్తు కాలము నాటి వాస్తవము. యూదులు ఆయనను నిరాకరించారు. అన్యజనులు ఆయనను అంగీకరించారు గనుక అది ప్రవచనాత్మకమైనది.

ఈ ఉపమానము విశాదకరమైనది ఏలయనగా దేవుని ఆహ్వానము నంగీకరింపని అనేకుల విశాదాంతము అది తెలియజేయుచున్నది. ఇహసంబంధమైన ఆస్థి పాస్తులపై యున్న వ్యామోహమును బట్టి వారు తమ్మును తామే నిత్య సంతోషము నుండి వెలివేసుకొన్నారు!

\- లూయిస్ రష్మోర్

# దేవుడు సృష్టిని అధిగమించునా?
## (Does God Transcend Creation?)

ఈలోకంలో అంతరంగిక శక్తులున్నవని మనం ఎరిగియున్నదే. విత్తనముల ద్వారా వృక్షములు విస్తరించును. జీవరాసులు తమకు తామే ఉత్పత్తి చేసుకొను లక్షణములు కలిగి యున్నవి. ఈ విశ్వములో గ్రహచలనముల శక్తి ఎంత ఖచ్చితంగా యున్నదంటే సూర్య చంద్ర భూగ్రహణములు, ఆయా అంతరిక్ష సంగతులు మొదలగు వాటిని మనం దోషరహితముగా ముందే చెప్పవచ్చును.

**ప్రకృతి సహజసిద్ధముగా ఆధారరహితమైనదా ? :**

ప్రకృతి శక్తులు ఎంత ఖచ్చితమైనవంటే, అవిదైవిక సంకల్పము లేకనే వాటికవే ఉనికి కలిగియున్నాయని కొందరు చెబుదురు. ప్రకృతిలో గోచరమగు ఏకీకృతను బట్టి అవి అట్లున్నాయనే అభిప్రాయము మనకు కలుగువచ్చును. అయితే అదిసత్యము కాదని మనమెరుగుదుము. ఏలయనగా అడవి గడ్డిని దేవుడు అలంకరించుచున్నాడని బైబిలు చెప్పుచున్నది (మత్తయి 6:30). దేవుడు ఆకాశ పక్షులకాహారమిచ్చును (మత్తయి 6:26). మరియు ఆయనకు తెలియకుండా పిచ్చుకపాటు సయితము సంభవించదు (మత్తయి 10:29). దేవుడు తగిన కాలమందు జంతువులకాహార మొసగును. తన గుప్పిలివిప్పి మంచి వాటిని వాటికి అందించును. ఆయన తన ముఖమును మరుగు చేసికొనగా అవి కలతపడును (కీర్తన 104: 27-30 యోబు 12:8-10). ఇట్లు చెప్పుచున్నది: "భూమిని గూర్చి ధ్యానించిన యెడల అదినీకు బోధించును, సముద్రములోని చేపలును నీకు దాని వివరించును. వీటిఅన్నిటినిబట్టి యోచించుకొనిన యెడల యెహోవా హస్తము వీటిని కలుగజేసెనని తెలిసికొనలేనివాడెవడు? జీవరాసుల ప్రాణమును మనుష్యులందరి ఆత్మలును ఆయన వశముననున్నవిగదా". "దేవుని ఊపిరివలన మంచుపుట్టును" (యోబు 37:10). "భూదిగంతములనుండి ఆవిరి లేవజేయువాడు ఆయనే. వాన కురియునట్లు మెరుపు పుట్టించువాడు ఆయనే. తననిధులలోనుండి గాలిని ఆయన బయలు వెళ్లజేయును" (కీర్తన 135:7). "ఆకాశమందును భూమి యందును సముద్రములయందును మహాసముద్రములన్నిటి యందును ఆయన తన కిష్టమైనదంతయు జరిగించువాడు" (కీర్తన 135:6). "నీవు భూమి మీద పడుమని హిమముతోను

వర్షముతోను మహావర్షముతోను ఆయన ఆజ్ఞఇచ్చుచున్నాడు" (యోబు 37:6). "నీవు ఇంత వరకేగాని మరి దగ్గరకు రాకూడదనియు, ఇక్కడనే నీతరంగములు పొంగు అణపబడుననియు" ఆయన సముద్రమున కాజ్ఞాపించెను (యోబు 38:11).

**దేవుడు మానవుని అవుసరములు తీర్చును :**

పైన చెప్పబడిన లేఖనములను బట్టియు, అట్టివి అనేకలేఖనములను బట్టియు దేవుడే ప్రకృతి నేలువాడని, అందరికీ దయచేయువాడని గమనించ గలము. ఆయన మానవుల అవుసరము లను తీర్చును. మా అనుదినహారము మాకు దయచేయుమని ప్రార్థించుటను గూర్చి యేసు నేర్పించెను (మత్తయి 6:11). మరియు మన తలవెంట్రుకలన్నియు లెక్కింపబడియున్నవని కూడ ఆయన చెప్పెను (మత్తయి 10:30). క్రైస్తవులకు దేవుడు ప్రత్యేక దీవెనల నొసగును (ఎఫెసీ 2:6). ఆయన నీతిమంతుల మీదను అనీతిమంతుల మీదను వర్షము కురి పించును (మత్తయి 5:45). ఆయన ఆకాశమునుండి వర్షమును, ఫలవంతము లైన రుతువులను దయచేయుచు ఆహారమునను(గహించుచు, మేలు చేయుట చేత తన్నుతాను గూర్చి సాక్ష్యము లేకుండ చేసికొనలేదు (అపొ.కా. 14:17). ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపరచబడుచున్నవి (రోమా 1:20).

**మానవుడు దేవుని స్వరూపమున చేయబడినవాడు :**

మానవుని నాసికా రంధ్రములలో దేవుడు తన జీవపు ఊపిరిని ఊదినప్పుడు మానవుడు జీవించు ఆత్మ ఆయెను. మానవుని ఆయన ఒక దేవునిగా చేయ లేదు. మానవునిలో తన్నుతాను పునరుత్పత్తి చేసుకొనలేదు. దేవుడు మానవుని ఆయన స్వరూపములో మాత్రమే చేసెను. మానవుడు దేవుడు కాదు. అతడు అన్ని విషయములలోను పరిమితి గలవాడు.

మనము దేవునియందు బ్రదుకు చున్నాము, ఉనికిని కలిగియున్నాము. అయితే మనము దేవుండ్లముకాదు. ఎఫెసీ 4:6 లో దేవుడు "అందరికిపైగా ఉన్నవాడై అందరిలో వ్యాపించి అందరిలో ఉన్నాడు" అన్నప్పుడు ఆయనతో మనకు గల అంతరంగిక సంబంధమును పోలు అక్కడ తెలియజేయుచున్నాడు. ఈవిశ్వము దేవునితో సమానముకాదు, ఆయన విశ్వానికి పైగా యున్నవాడు. దేవునికిని ఆయన చేసిన సృష్టికిని వ్యత్యాసమేమీ లేకపోతే వారిద్దరు ఒక్కటే అయ్యుండాలి. గాని వారిద్దరు వేర్వేరు.

**1.** దేవుడు నిత్యుడు. "ప్రభువా తరతరములకు నీవే దేవుడవు" (కీర్తన 90:2). భూమికి ఆది ఒకటి యున్నది. "ఆది యందు దేవుడు భూమ్యాకాశము లను సృజించెను" (ఆది.కా. 1:1).

**2.** దేవుడు నిత్యము నిలుచును. "యెహోవా, నీవు నిత్యము సింహాసనా సీనుడవు, నీనామస్మరణ తరతరములుం డును" (కీర్తన 102:12). "భూమియు దానిమీదనున్న కృత్యములును కాలి పోవును" (2 పేతురు 3:10). "ఆకాశము లు మహాధ్వనితో గతించిపోవును, పంచ భూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును" (2 పేతురు 3:10-11).

**3.** "యెహోవా ఆలోచన సదా కాలము నిలుచును. ఆయన సంకల్ప ములు తరతరములకు ఉండును" (కీర్తన 33:11). మనుష్యుడైతే వేరు. "గ్రహించు వాడొక్కడును లేడు" (రోమా 3:11).

**4.** "దేవుడు అబద్ధమాడజాలడు" (హెబ్రీ 6:18). "క్రేతీయులు ఎల్లప్పుడు అబద్ధికులు" (తీతు 1:12).

**5.** ఈ సంగతులు అనాదికాలము నుండి ప్రభువు ఎరుగును అని అపొ.కా. 15:18 చెప్పుచున్నది. మానవుడు మన ప్రభువును రక్షకుడునునైన యేసు క్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞాన మందును అభివృద్ధి పొందవలసి యున్నది (2 పేతురు 3:18).

**6.** "యెహోవా కన్నులు ప్రతి స్థలము మీదనుండును" (సామె 15:3). కొందరు కన్నులుండియు చూడరని యేసు చెప్పెను (మార్కు 8:18).

**7.** దేవుడు పరిపూర్ణుడు (మత్త 5:48). మానవులైతే "ఏభేదమును లేదు. అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేకపోవు చున్నారు" (రోమా 3:23).

**8.** "దేవుడు చెప్పిన యేమాట యైనను నిరర్థకము కానేరదు" (లూకా 1:37). "మనుష్యులకు అసాధ్యములైనవి దేవునికి సాధ్యములు" (లూకా 18:27).

**9.** "యెహోవా ఉత్తముడును యదార్థవంతుడునై యున్నాడు" (కీర్తన 25:8). మంచి వాడొక్కడే, ఆయనే దేవుడ ని యేసు చెప్పెను (మత్తయి 19:17).

దేవుడు, ఈలోకము వేర్వేరు అని చెప్పుటకు పై లేఖన భాగములుచాలు. దేవుడొక్కడే నిత్యత్వము లేక అమరత్వము గలవాడు (1తిమో 6:16). మానవుడైతే మరణింపవలసి యున్నది (హెబ్రీ 9:27). దేవుడు ఈ విశ్వము వేర్వేరు. దేవుడు ఈవిశ్వము నుండి వేరైయున్నారు. ఆయన ఈ విశ్వమునకు ముందునుండి యున్నవాడు. ఈవిశ్వము, లేక ప్రకృతి దేవుడు కాదు. అది దేవునితో సమానము కాదు. దేవుడు ఈ విశ్వాన్ని, ప్రకృతిని అధిగమించియున్నారు. - ఓటిస్‌గేట్వుడ్

# దేవుని స్వరము
## (The voice of God )

"ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను ఎవడైనను నాస్వరము విని తలుపు తీసిన ఎడల నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును నాతో కూడా అతడును భోజనము చేయుదుము" (ప్రకట 3:20).

ఈ వాక్యభాగమునను సరించి కొన్ని ప్రాముఖ్యమైన విషయములను నేర్చుకొందము.

1. దేవుని స్వరము వినుట 2. తలుపుతీయుట 3. దేవునితో సహవాసము చేయుట.

**1. దేవునిస్వరము వినుట :**

ఒకపసిబిడ్డ తన తల్లి స్వరమును ఎంత మందిలో ఉన్న గుర్తు పడుతుంది. తల అటుత్రిప్పిచూస్తుంది. తల్లి స్వరం వినగానే ఆబిడ్డలో ఎంతో సంతోషము, ఎంతో నిశ్చింత ఎంతో నెమ్మది కలుగుతుంది. తల్లి స్వరం ఆ చిన్నప్రాణికి ధైర్యాన్నిస్తుంది. తన ప్రాణాన్ని తల్లి ప్రాణం అండ అని ఎంతో ధీమా. ఇది రక్తసంబంధం ప్రేమ బంధం ఈ ప్రేమకు ఎటువంటి షరతులు ఉండవు.

మానవునితో దేవుని సంబంధం కూడా అలాంటిదే. దేవుని యొక్క రూపంలో ఉన్న దేవుని యొక్క జీవాత్మ అయిన మానవుడంటే దేవునికి ఎంతో ప్రేమ. దేవునికి ఎంత ప్రేమంటే మానవుని కొరకు తన ప్రియ కుమారుని సహితం త్యాగం చేయడాన్ని వెనుదీయలేదు.

చిన్నపిల్లవలె మన ఇంటిలోని పెంపుడు జంతువులు కూడా మన స్వరాన్ని విని లోబడుతాయి.

యోహాను 10:45 "మరియు అతడు తన సొంత గొఱ్ఱెలన్నిటిని వెలుపలికి నడిపించునపుడెల్లా వాటికి ముందున డుచును. గొర్రెలు అతని స్వరమునెరుగును గనుక అతని వెంబడించును. అన్యులు స్వరము అవి ఎరుగవు గనుక అన్యుని ఎంతమాత్రమును వెంబడింపక వాని యొద్దనుండి పారిపోవునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను".

ప్రాణం పెట్టునంతగా ప్రేమిస్తున్న దేవుని స్వరము వినుట ఆస్వరానికి విధేయత చూపించుటకన్నా మించిన భాగ్యము మరొకటిలేదు. దేవుని వాక్యము ను వినాలి, విశ్వసించాలి, విధేయతచూపి పాపక్షమాపణ నిమిత్తమై బాప్తీస్మము పొంది క్రీస్తు సంఘము ద్వారా ఆయనతో సహవాసము చేయాలి.

దేవుని స్వరమును వినకపోవడాన్ని హృదయమనే తలుపు తీయకపోవడాన్ని

తద్వారా నిత్యజీవమును పోగొట్టుకొనే దుస్థితికి కారణాలు చూద్దాము.

**అవిధేయత:-** ఇది ఆదాముతోనే ప్రారంభమయినది. ఆది.కా. 2:7 "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికరంధ్రములలోనికి జీవాయువును ఊదగానరుడు జీవాత్మ ఆయెను. దేవుడు ఆదామును తన చేతులతో ఎంతో అపురూపముగా చేసి ఆయన జీవాయువును ఊది సజీవునిగా చేసి, తాను చేసిన సృష్టి అంతటిపై అధిపతిని గాను తన రాజ్యవారసునిగాను చేసికొనెను. రోజు ఆదాము స్వరమును వినాలని అతనితో మాట్లాడలని అతని ప్రేమకొరకు అతని సహవాసము కొరకు ఆయన హృదయం ఆశపడేది గాని ఒకరోజు ఆదాము హవ్వలు సాతాను యొక్క స్వరమును విని దేవుడు తినవద్దన్న పండును తినుట ద్వారా దేవునికి అవిధేయత చూపారు. ఆది.కా. 3:8-10 "చల్లపూటను ఆదాము తన భార్యయు తోటలో సంచరించుచు దేవుడై యెహోవా స్వరము విని దేవుడైన యెహోవా ఎదుటికి రాకుండా తోట చెట్ల మధ్యను దాగు కొనగా...." ఇది చాలా భయంకరమైన పరిస్థితి. యెహోవా స్వరమును విన్నారే గాని ఆయన ఎదుటకు రాలేని పరిస్థితి. తండ్రియైన దేవుని స్వరముకంటే అపవాది స్వరానికి విధేయత చూపుట వల్ల ఆదాము తన వారసత్వాన్ని, దేవుని సహవాసాన్ని కోల్పోయాడు. దేవుని సన్నిధినుండి, ఏదేనుతోట నుండి వెళ్ళగొట్టబడ్డాడు.

**2. అంధకారక్రియలు :-** న్యాయా 13-16 సమ్సోను న్యాయాధిపతిగా దేవునిచే ఏర్పాటు చేయబడిన వ్యక్తి. పరిశుద్ధముగా పెంచబడుటకు నిర్దేశించబడి ప్రత్యేకించబడిన వ్యక్తి, పరిశుద్ధముగా పెంచబడుటకు నిర్ధేశించబడిన వ్యక్తి. దేవుని బలాన్కి సజీవసాక్ష్యము. అయితే సమ్సోను తన శరీరక క్రియల వలన దెలీలా అనే వేశ్యకు లోబడి ఆమె యొక్క స్వరమును విన్నాడు. దేవుడు ఎన్నిసార్లు హెచ్చరించినను వినలేని పరిస్థితికి దిగజారిపోయాడు. ఫిలిష్తీయుల చేతిలో నుండి ఇశ్రాయేలీయులను విడిపింప వలసిన వ్యక్తి ఫిలిష్తీయుల చేతిలో బానిస అయిపోయాడు. దేవునికి తన హృదయపు తలుపులు మూసి వేయుట వలన దేవుని కృపకు శాశ్వతంగా దూరమైపోయాడు. దేవుని ఆత్మ అతనికి దూరమయ్యింది. నామ రూపాలు లేకుండా పతనమయ్యాడు.

**3. దేవుని స్వరం వినలేకపోవుటకు మరొక కారణం నిర్లక్ష్యం :-**

మత్తయి 25:6 "అర్ధరాత్రి వేళ హఠాత్తుగా ఇదిగో పెండ్లి కుమారుడు అతనిని ఎదుర్కొనరండి అని కేక విన బడెను". పది మంది కన్యకలలో ఐదుగురు వారితో కూడా వెళ్లిపోయారు అయిదుగురు

బుద్ధిలేనికన్యకలు తుళ్లి పడి లేచారు. కాని అప్పటికే ఆలస్యం జరిగిపోయింది. జరుగవలసిన నష్టం జరిగిపోయింది. కారణం వెలుగుతూ ఉండవలసిన వారి దివిటీలు ఆరి పోయాయి. మెలకువగా ఉండవలసిన వారు శారీరక శోధనకు లొంగిపోయారు. దేవుని స్వరం వినబడినపుడు వారు వినలేని స్థితిలోనున్న వారు తమ నిర్లక్ష్య దోరణి వలన తమ హృదయమనే తలుపులు తెరవలేదు. తరువాత పెండ్లి కుమారుని తలుపులు తీయమని ఎంతగా వారు ప్రాధేయబడినను దేవుని తలుపులు శాశ్వాతంగా మూసి వేయబడినవి. దేవుడు వారికిచ్చిన కఠినమైన సమాధానము మత్తయి 25:12 "మిమ్ము నెరుగనని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానను".

**4. వాయిదా వేసే పద్ధతి :-**

అపో.కా. 24:24-25 "పౌలు నిత్య జీవమును గూర్చి దేవుని నీతిని గూర్చి, ఆశానిగ్రహమును గూర్చి, రాబోవు విమర్శను గూర్చి హెచ్చరింప ప్రయత్నించినపుడు ఫేలిక్స్ పౌలు మాటలకు భయపడి ఇప్పటికి వెళ్ళుము నాకు సమయమయినపుడు నిన్ను పిలువనంపింతునని చెప్పెను" కాని ఫేలిక్స్ జీవితములో ఆసమయము ఎప్పుడు రాలేదు. దేవుని స్వరమును వినుటకు వాయిదావేసి మరి వినలేని స్థితిలో ఉన్న ఫేలిక్స్ జీవితములో పరదైసు యొక్క తలుపులు శాశ్వతముగా మూయబడ్డాయి.

**దేవుని స్వరమును విని తలుపులు తీయుట**

**1. సమరయస్త్రీ :-** యోహాను 4:39-42 సమరయస్త్రీ జీవితం అంతా పాపమే. ఆమే జీవితంలో పాపపు కేకలు తప్ప మరొకస్వరం ఆమెకు వినబడలేదు. కన్నీరు, పరిహాసము తప్ప కరుణ ప్రేమ అంటే ఏమిటో ఆమెకు తెలియదు. యేసు ప్రభువు ఆమె కొరకు బావి దగ్గరకు వచ్చి ఆమెతో మాట్లాడారు. ఆమె హృదయాన్ని తట్టారు ఆమె ఆయన స్వరమును విన్నది. ఆ స్వరంలోని ప్రేమ, కరుణ చవిచూసింది. ఆమెలో పశ్చాత్తాపం కల్గింది. ఆక్షణం వరకు పతితగా యున్న ఆమె దేవుని ప్రేమకు ప్రతిరూపంగా మారింది. మెస్సీయాను కనుగొన్నాను అని ఆగ్రామమంతా చాటి చెప్పింది.

**2. జక్కయ్య :-** లూకా 19:1-10 జక్కయ్య సుంకపుగుత్తదారుడు. అతని జీవితమంతా అక్రమార్జనే. అన్యాయపు లెక్కలే ఆయనకు కాసుల గలగలలు తప్ప దేవుని స్వరము తెలియదు.

అటువంటి జక్కయ్య ఒక రోజు యేసుప్రభువు ఆదారిన వస్తున్నాడని తెలిసి యేసు ఎవరో అని చూడగోరి

పొట్టివాడైనందున మేడి చెట్టు ఎక్కాడు. అతని జీవితములో పశ్చాత్తాపము లేదు. దేవునికి

జీవితాన్ని సమర్పించాలి అనిగాని ఆచెట్టు ఎక్కలేదు.

కాని యేసు ప్రభువు మాత్రము జక్కయ్య కొరకే ఆదారిన వచ్చారు. యేసు ఆచోటికి వచ్చినపుడు కన్నులెత్తి అతని చూచి, జక్కయ్య త్వరగా దిగుము నేను నీ ఇంటికి రావలసియున్నది అని పలికెను. జక్కయ్య విధేయత చూపాడు రక్షింపబడ్డాడు.

**3. అపో.పౌలు** : అపో.కా. 9 అ అపో.పౌలు దమస్కు మార్గములో దేవుని స్వరమును విన్నాడు. ఆయనను రక్షకునిగా అంగీకరించాడు. ఆయన జీవనవిధానమే మారిపోయినది. క్రైస్తవులను హింసించుటకు బయలుదేరిన వాడు అనేకులను క్రైస్తవులుగా మార్చాడు, అన్యజనులను క్రైస్తవులుగా మార్చుటకు పిలువబడ్డాడు.

**3. దేవునితో సహవాసముచేయుట :-**

దేవుని స్వరం విని హృదయతలుపులు తెరచినట్లయిన ఆయనవారితో సహవాసము చేస్తారు.

**1. నూతన సృష్టి :-** 2 కొరింథి 5:17 కాగా ఎవడైనను క్రీస్తునందున్న ఎడల వాడు నూతన సృష్టి ఇదిగో పాతవి గతించెను సమస్తమును క్రొత్తవాయెను. పౌలు నూతన సృష్టిగా మార్చబడ్డాడు. గలతీ 2:20 "నేను క్రీస్తుతోకూడా సిలువవేయబడియున్నాను. ఇకను జీవించువాడను నేను కాను క్రీస్తే నాయందు జీవించుచున్నాడు.

**2. ఫలించెడి కొమ్మలు :-**

యోహాను 15:5 ద్రాక్షావల్లిని నేను తీగలు మీరు. ఎవడునాయందు నిలిచియుండునో నేను ఎవనియందు నిలిచి యుందునో వాడు బహుగా ఫలించును.

**3.** దేవునితో సహవసించు వారు దేవుని మహిమపరుస్తారు. యోహాను 15:8 "మీరు బహుగా ఫలించుట వల్ల నా తండ్రి మహిమ పరచబడును. ఇందువలన మీరు నాశిష్యులగుదురు".

**4.** దేవునితో సహవసించువారు ప్రకాశించు నక్షత్రమువలె ఉంటారు. దాని 12:3 " బుద్ధిమంతులైతే ఆకాశ మండలములోని జ్యోతులను పోలినవారై ప్రకాశించెదరు. నీతి మార్గము అను సరించినడచుకొనునట్లు ఎవరు అనేకు లనుత్రిప్పుదురో వారు నక్షత్రములవలె నిరంతరము ప్రకాశించెదరు".

5. దేవునితో సహవసించేవారు ఘనమైన స్వాగతము పొందెదరు మత్తయి 25:34. అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి నాతండ్రి చేత ఆశీర్వదించబడిన వారలారా రండి లోకముపుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి.

6. దేవునితో సహవసించేవారు

విజయోత్సాహముతో పరలోకమును స్వతంత్రించుకొందురు.

2 పేతురు 1:11 "అందువలన సహోదరులారా! మీపిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎల్లప్పుడు తొట్రిల్లరు. అలాగున మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు యొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహించబడును.

యోహాను 10:1 గొర్రెల దొడ్డిలో ద్వారమున ప్రవేశింపక వేరొక మార్గమున ఎక్కువాడు దొంగయు దోచుకొనువాడునై యున్నాడు, ద్వారమున ప్రవేశించువాడు గొర్రెల కాపరి. అతనికి ద్వార పాలకుడు తలుపుతీయును గొర్రెల అతని స్వరము వినును అతడు తన స్వంత గొర్రెలను పేరు పెట్టి పిలిచి వాటిని వెలుపలికి నడిపించును.

ప్రస్తుత కాలంలో దేవుడు ఆయన వాక్యము ద్వారా మనతో మాట్లాడు చున్నారు. ఆయన వాక్యమునకు మన హృదయమనే తలుపు తెరచి ఆయనతో నిత్యము సహవాసము చేయుటకు ఆయనను మన హృదయములోనికి ఆహ్వానిద్దాము.

- బి.యస్.ఎ. సువార్త

## మృతుడవా లేక సజీవుడవా?
## (Dead or Alive ? )

"ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు" (1కొరింథీ 15:22).

ఆదాము హవ్వలవలె దేవుని హెచ్చరికలును వినియు, ఎందరు నిరాకరించి అవిధేయత చూపుదురో వారందరు పాపము వలన ఆత్మీయముగ మృతుల వుదురు. దేవుని మాటల కంటె అపవాది యొక్క మాటలను మనము లక్ష్యపెట్టి నప్పుడు ఆదామువలె ఆత్మీయ జీవిత ఆధారము నుండి తొలగించబడుదుము. మన సృష్టికర్త యొక్క సహవాసమును కోల్పోవుదుము. అందరును పాపము చేసిన వారే. అంటే ఆదామునందున్న వారమే. అంటే ఆత్మీయముగా మృతు లమే. మృతులు మృతులను పాతిపెట్ట నిమ్ము అని యేసు చెప్పినప్పుడు ఇట్టి స్థితిలో యున్న వారిని గూర్చి చెప్పారు. ఆలాగే తప్పిపోయిన కుమారుడు అట్లే చనిపోయెను (లూకా 8:22; లూకా 15:32). సుఖభోగము లయందు ప్రవర్తించు విధవరాలు బ్రదుకుచుండియు చచ్చినదై యుండునని అందుకే పౌలు చెప్పాడు (1 తిమోతి 5 : 6).

**ఆదాము యొక్క అవిధేయతను అనుకరించువారందరు మృతులైనవారు :**

పాపము వలన అందరు ఆదాము నందు మృతినొందుదురు. ఎఫెసీ 2:1-6 ఇట్లు చెప్పుచున్నది: "మీరు అపరాధముల చేతను పాపములచేతను చచ్చినవారై యుండగా ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను. మీరు వాటిని చేయుచు వాయుమండల సంబంధమైన అధిపతిని, అనగా అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి యీప్రపంచ ధర్మము చొప్పున మునుపునడుచుకొంటిరి. వారితో కలసి మనమందరమును శరీరము యొక్కయు మనస్సు యొక్కయు కోరికలను నెరవేర్చుకొనుచు మన శరీరాశలను అనుసరించి మునుపు ప్రవర్తించుచు కడమ వారి వలెనే స్వభావ సిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమై యుంటిమి. అయినను దేవుడు కరుణా సంపన్నుడై యుండి మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండి నప్పుడు సయితము మన యెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను కృప చేత మీరు రక్షింపబడి యున్నారు".

**ఆత్మీయ జీవమంతయు క్రీస్తులో యున్నది :**

మనము యేసు యొక్క మాదిరిననుసరించి తండ్రి చిత్తమునకు సంపూర్ణ విధేయత చూపినప్పుడు మన ఆత్మీయ జీవము క్రీస్తులోయుండును. మన పాపపు ఘోరతత్వమును దేవుని ప్రేమను గమనించినప్పుడు మార్పు నొంది పాపముల అభ్యాసమును విసర్జించి దేవుని వైపు తిరుగుదుము.

ఆదాము యొక్క మాదిరిని విడచి, బాప్తిస్మము పొంది దేవునికి విధేయత చూపినప్పుడు ఆత్మీయయుగా సజీవులమగుదుము. ఆయనతో కూడ పాతిపెట్టబడి నూతన జీవము పొందినవారమై ఆనీటి సమాధినుండి తిరిగి లేపబడుదుము. పాపమును ద్వేషించి, భక్తిని ప్రేమించునట్లు మన హృదయములు మార్చబడును.

"మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి. మరియు అపరాధముల వలనను శరీరమందు సున్నతి పొందక యుండుట వలనను మీరు మృతులై యుండగా, దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞ వలన మన మీద రుణముగాను మనకు విరోధముగాను ఉండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దాని మీది చేవ్రాతను తుడిచి వేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధములన్నిటిని

క్షమించి ఆయనతో కూడ మిమ్మును జీవింపచేసెను" (కొలస్స 2:12-14).

"మనము సహోదరులను ప్రేమించుచున్నాము గనుక మరణములో నుండి జీవములోనికి దాటి యున్నామని యెరుగుదుము. ప్రేమలేనివాడు మరణమందు నిలిచి యున్నాడు. తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు, ఏ నరహంతకునియందును నిత్యజీవముండదని మీరెరుగుదురు. ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను గనుక దీని వలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. మనము కూడ సహోదరుల నిమిత్తము మనప్రాణములను పెట్టబద్ధులమై యున్నాము" (1 యోహాను 3:14-16).

"ఎందుకనగా మనము కూడ మునుపు అవివేకులమును, అవిధేయులమును మోసపోయిన వారమును నానా విధములైన దురాశలకును భోగములకును దాసులమై యుండి దుష్టత్వమునందును అసూయ యందును కాలము గడుపుచు అసహ్యులమై యొకనినొకడు ద్వేషించుచు ఉంటిమి గాని మన రక్షకుడైన దేవుని యొక్క దయయు మానవుల యెడల ఆయనకున్న ప్రేమయు ప్రత్యక్షమైనప్పుడు మనము నీతిని అనుసరించి చేసిన క్రియలమూలముగ కాక తనకనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగ జేయుట ద్వారాను మనలను రక్షించెను. మనమాయన కృప వలన నీతిమంతులమని తీర్చబడి, నిత్యజీవమును గూర్చిన నిరీక్షణను బట్టి దానికి వారసుల మగుటకై అపరిశుద్ధాత్మను మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా ఆయన మన మీద సమృద్ధిగాకుమ్మరించెను" (తీతు 3:3-7).

దిగువలేఖనభాగములను ప్రార్థన పూర్వకముగా చదువుము. రోమా 6:1-19; 1 పేతురు 1:22-25; 3:1-17; అపో.కా. 2:37-42; 1 యోహాను 2:3-6; తీతు 2:11-14.

క్రీస్తునందు మనము సజీవులుగా చేయబడ్డాము. మరియు ఆయన సారూప్యమునకు మార్చబడుచున్నాము. ఆయన లక్షణములను అనుకరించుచు, ఆయన ప్రేమించిన రీతిగా ప్రేమించుచు, క్షమించిన రీతిగా క్షమించుచు, ఆయన ఆత్మ మనలో పనిచేయుచుండగా ముందుకు సాగుదము.

- జె.లీరోబర్ట్స్

# "ఆరాధనకు ఆహ్వానము"
## (Invitation to Worship)

సంఘారాధన ముఖ్యముగా దేవుని ఘనపరచుటకు ఉద్దేశించబడినది. ఆయన ప్రజలు కూడుకొని యెహోవాదేవుడు తమ సృష్టి కర్తయని గుర్తించుదురు. ఆయన ఎల్లవేళల యుండువాడని, గతంలోను, ప్రస్తుతంలోను, భవిష్యత్తులోను యుండువాడని గుర్తించుచు తమ తలలు ఆయన సన్నిధిని వంచుదురు. ఆయన సర్వశక్తిమంతుడని ఈ విశ్వమంతటికీ కర్తయని వారు గ్రహింతురు.

మనం పాడు పాటలు, చేయు ప్రార్థనలు, విన్పించు దేవుని వాక్యము, ప్రభురాత్రి భోజనం, కానుకలు వగైరా ఇవన్నీ ఆయన యెడల మనకున్న ప్రగాఢ ప్రేమను ప్రకటించుటకు ఉద్దేశించబడినవి. ఇంకోమాటలో మనం ఆరాధనకు కూడుకొను ప్రతిసారి మనం విశ్వాసులమని, మన సృష్టికర్త గొప్పవాడని ఆయనను కొనియాడ్తాము, స్తుతి చెల్లిస్తాము. మన హృదయాలు ప్రేమతో, కృతజ్ఞతతో నిండియుంటాయి. తన బిడ్డలు దేవుని ఆరాధించాలనీ, వారాయనను ఆరాధింప కోరిక గలవారనీ పదే పదే బైబిలులో మనకగుపడ్తాది.

దేవుని ఆరాధించుటకు క్రైస్తవులు కూడుకొనునప్పుడెల్లా ఏకాత్మ ఏక అభిప్రాయములు గల వారికి శక్తిని ప్రోత్సాహమును ఇచ్చునని మనం గ్రహించాలి. దేవుని భక్తితోఆరాధించునపుడు ఒండొరులతో మన ప్రగాఢ సహవాసాన్ని పంచుకొంటాము, విశ్వాసములో బలపడ్తాము. ఆయనకు స్తుతి గానము లు పాడుటలో మన స్నేహసుహృద్భావములు ఒండొరులతో బలపడ్తాయి. ఒకరినొకరు హెచ్చరించు కొంటాము, ప్రోత్సహించుకొంటాము. దేవుని కుటుంబానికి చెందిన వారమనే భావం కలుగుతాది. దేవుని సింహాసనము యెదుట సోదరసోదరీలవలె కలసి ఆరాధించుటలో ఈ గొప్ప ఆత్మీయ బంధుత్వం మరింత శక్తివంతమౌతుంది.

మనకు సమయం దొరికినప్పుడెల్లా తోటి సోదర సోదరీలతో కలిసి మనం ఆరాధన చేయుదము గాక. "యెహోవా మందిరమునకు వెళ్లుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని" యని దావీదు చెప్పినట్లు మనం కూడ చెప్పుదుము గాక (కీర్తన 122:1). క్రీస్తుసంఘమే దేవుని మందిరమని మనం ఎరుగుదుము (1తిమోతి 3:15). అందువలన దేవుని కుటుంబము ఆయన నారాధించుటకు ఎల్లవేళలా సంతసించును గాక !

– మేక్వీబోరెన్

## సంక్షిప్త వార్తలు

2014 జూలై 11వ తేదీ శుక్రవారం కాకినాడ సత్యవాణి – క్రీస్తుసంఘ ఆవరణలో సువార్తికుల సదస్సుజరిగెను. ఆంధ్ర, తెలంగాణ ప్రాంత సువార్తికులు పలువురు హాజరైరి. సోదరులు యన్, ఏలియా (దేవగుప్తం), వి. బాబీ (అమలాపురం), రిక్కీ గూటం గార్లును, అమెరికా నుంచి వచ్చిన జెస్సీబేల్, మరియు రాయన్ వాట్సన్ గార్లును చక్కటి వాక్యపరిచర్య చేసిరి, జాషువా గూటం గారు ఆదిమ సంఘాభివృద్ధి ఎట్లు జరిగినదో దానిని గూర్చిన వివరణ యిచ్చిరి. అమెరికా నుండి వచ్చిన యువతీ యువకులు ఆరుగురు చక్కటి ఇంగ్లీషు పాటలను పాడి వినిపించిరి, అందరు సంతోషించిరి.

2014 జూలై 17వ తేదీ గురువారం కాట్రేనికోన మండలం దొంతికుర్రులో సువార్త కూటము జరిగెను. రిక్కీగూటం గారును, పైన చెప్పబడిన అమెరికా యువకుల బృందమును హాజరై మంచి వాక్యపరిచర్య చేసిరి. ఫలితముగా ఒకరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. పల్లంకుర్రు, దొంతికుర్రు, కందికుప్ప గ్రామములలో సోదరులు బూల యోహాను గారును ఆయన కుమారుడు చిరంజీవియును చాల కాలము నుండి క్రీస్తు కొరకు మంచిపని చేయుచున్నారు.

2014 జూలై 27వ తేదీ ఆదివారం విజయవాడ వాంబే కోలనీలో యున్న క్రీస్తు సంఘ ఆరాధనలో జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరైరి. వారి రెండవ కుమారుడు రోనీ గూటం, ఆయన సతీమణి హరితరత్న గూటం గారు కూడ హాజరై చక్కటి క్రైస్తవ సహవాస మాధుర్యమును ఆస్వాదించిరి. సాయంకాల ఆరాధనకు రెండు వందలకు పైగా జనముహాజరై వర్షమును సయితము లెక్క చేయకుండా దేవుని వాక్యమును వినిరి. రోనీ గూటం గారు, జాషువా గూటం వాక్య పరిచర్య చేసిరి. ఆరాధన అనంతరం జాషువాదంపతులను, రోనీ దంపతులను స్థానిక సంఘము ఘనముగా సత్కరించిరి. వాంబే కోలనీలో సోదరులు కె. రాజ్‌కుమార్ గారు నిర్విరామ కృషి చేస్తు క్రీస్తు కొరకు, సత్యముకొరకు బలమైన యోధునిగా పనిచేయుచున్నారు.

2014 జూలై 28వ తేదీ సోమవారం కృష్ణాజిల్లా నూజివీడులో జరిగిన సువార్తికుల సహవాస కూటమునకు జాషువా గూటం గారు, రోనీ గూటం గారు

సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య చేసిరి. వర్షాభావమైనను అనేకమంది సువార్తికులు హాజరై ఆహ్లాదకరమైన వాతావరణములో గొప్ప సహవాసములో పాల్గొనిరి. నూజివీడు ఏరియలో ఓర్సు ఆదాము గారు క్రీస్తు కొరకు మంచి పని చేయుచున్నారు.

శక్తి టి.వి. కార్యక్రమములు ఇప్పుడు కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలలో వీక్షించ వచ్చును. సత్యవాణి కార్యక్రమములు ప్రతి బుధ, శుక్రవారం రాత్రి 8.00 గంటలకు శక్తి ఛానల్ చూడండి. అదే సమయంలో www. sakthitv.in లో Live Relay లో ప్రపంచ వ్యాప్తముగా వీక్షించవచ్చును.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004